విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, మంగళవారం 22, అక్టోబర్ 2024

పోలీసుల సేవలు మరువలేనివి : జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర-నంద్యాల: విధి నిర్వహణలో ప్రాణాలను తృణ ప్రాయంగా భావించి ప్రజల శ్రేయస్సుకై ప్రాణ త్యాగం చేసిన పోలీసుల సేవలు మరువ లేనివని జిల్లా కలెక్టర్ జి.రాజ కుమారి అన్నారు. సోమవారం నంద్యాల పట్టణం బొమ్మల సత్రం సమీపంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో అమర వీరుల సంస్మరణ దినోత్సవ వేడుకలు జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వ హించారు. ముందుగా పెరేడ్ కమాండర్ నాగభూషణం వద్ద నుండి జిల్లా కలెక్టర్, ఎస్పీ గౌరవ వందనం స్వీకరించారు. అనం తరం ఎఆర్ డీఎస్పీ శ్రీనివాసులు విధి నిర్వహణలో మృతి చెందిన వారి వివరాలను తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరం మాట్లాడుతూ విధి నిర్వహణలో పోలీసులు రక్షణ బాధ్యతలను నిర్వర్తిస్తూ ప్రాణాలను కోల్పోవడం బాధాకర మన్నారు. ప్రాణా లను లెక్క చేయకుండా ప్రజల శ్రేయస్సుకై ప్రాణ త్యాగం చేసిన పోలీసుల సేవలు మరువలేనివన్నారు. పోలీస్ ఉద్యోగం అన్నది ఎంతో స్ఫూర్తిదాయకమైన, గౌరవప్రదమైన అత్యంత బాధ్యతాయుతమైనదన్నారు. పగల నకా, రాత్రనకా, వర్షాన్ని, ఎండను లెక్కచేయ కుండా కఠిన పరిస్థితుల్లోను ప్రజల రక్షణ కోసం పని చేస్తుంటారన్నారు. మహిళలపై జరిగే నేరాలతో పాటు అతి సున్నితమైన విషయాలలో చాకచక్యంగా వ్యవహరిస్తూ ఉద్యోగ బాధ్యతలను నిర్వహించాల్సి ఉంటుందన్నారు. పోలీసు అమరవీరులను స్మరించు కుంటూ వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఘనంగా నివాళులర్పిస్తూ అమరవీరుల కుటుంబాలకు జిల్లా యంత్రాంగం తరఫున అండగా ఉంటామని కలెక్టర్ తెలిపారు. ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా మాట్లాడుతూ పోలీసు అమరవీరుల త్యాగనిరతిని స్మరించు కుంటూ ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న పోలీసు అమర వీరుల సంస్మరణ దినంగా జరుపు కుంటామన్నారు. దేశ, రాష్ట్ర భద్రత కోసం రాత్రింబవళ్లు పోలీసులు తమ ప్రాణాలను పణంగా పెట్టి విధులు నిర్వహిస్తార న్నారు. అమరవీరుల త్యాగాలను, సేవలను సింహావలోకనం చేసుకుం టూ సేవఅర్థాన్ని, పరమర్థాన్ని గుర్తిస్తూ కొనియాడారు. పోలీస్ సిబ్బంది ఐక్యత కోసం శిక్షణ, క్రీడా పోటీలు మొదలగు వాటిని ఎప్పటికప్పుడు జరిపించడం జరుగుతుందన్నారు. అమర వీరుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ పోలీ సులు అమరవీరుల సంస్మరణ దినంగా పాటిస్తూ అమరులైన పోలీసులకు శ్రద్ధాంజలి ఘటిస్తూ, జోహార్లు అర్పిస్తున్నట్లు ఎస్పీ వివరించారు.

కబ్జాలకు గురైన మున్సిపల్ స్థలాలను స్వాధీనం చేసుకోవాలి : సీపీఐ

విశాలాంధ్ర - నంద్యాల అర్బన్ : పట్టణంలో కబ్జాకు గురైన మున్సిపల్ స్థలాలను అధికారులు పరిశీలించి స్వాధీనం చేసుకోవాలని సీపీఐ పట్టణ కార్యదర్శి కె.ప్రసాద్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.సోమన్నలు డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియాకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తప్పుడు సర్వే నెంబర్లతో రిజిస్టర్లు చేయించుకున్న వారిపై, రిజిస్టర్లు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుని, పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. పట్టణంలో కోట్లాది రూపాయల విలువ చేసే మున్సిపల్ స్థలాలను, కబ్జాకు గురైన వాటిని గుర్తించి ప్రజా అవసరాలకు ఉపయోగించాలని కోరారు. తప్పుడు ధ్రువపత్రాలతో కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో సీపీఐ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారు. కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించిన వారిలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.బాబా ఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

// సంక్షిప్త సమాచారం //

రీ సర్వే సమస్యల పరిష్కారానికి గ్రామసభలు..

విశాలాంధ్ర-అవుకు: భూ రీసర్వేలో ఉన్న వివిధ సమస్యల పరిష్కా రానికే గ్రామ సభలు నిర్వహిస్తున్నామని తహశీల్దార్ సువర్ణాదేవి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి నుండి గ్రామ సభలు ప్రారంభమవుతాయని, వచ్చే నెల ఒకటో తేదీ వరకు నిర్వ హిస్తామన్నారు. 22న అన్నవరం, 23న చెన్నంపల్లి, 24న చర్లోపల్లి, 25న మెట్టుపల్లి, 26న నిచ్చెన మెట్ల, 29న సింగనపల్లి, 30న శివవరం, నవంబర్ ఒకటో తేదీన వేములపాడు గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహిస్తామన్నారు. ఆయా రోజుల్లో ఆ గ్రామాల్లోని రైతులు విస్తీర్ణంలో తేడా ఉన్నా, పేరు మార్పులు ఉన్నా, జాయింట్ ఎల్పీఎం నెంబర్లు ఉన్నా, ఖాతా నెంబర్‌లో సమస్యలు ఉన్నా వాటి పరిష్కారానికి గ్రామ సభల దృష్టికి తీసుకురావాలన్నారు.

నేటి నుంచి రెవెన్యూ గ్రామ సభలు..

విశాలాంధ్ర- ఉయ్యాలవాడ: మండలంలో మంగళవారం నుండి రెవెన్యూ గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహశీల్దార్ శ్రీనివాసులు, మండల సర్వేయర్ విజయలక్ష్మి తెలిపారు. సోమవారం వారు మాట్లా డుతూ 22న గోవిందపల్లె, 23న ఇంజెడు, 24న కాకరవాడ, 25న కొండుపల్లె, 26న నర్సిపల్లె, 29న ఆర్.జంబులదిన్నె, 30న రూపన గుడి, నవంబర్ 1న సుద్దమల్ల, 2న వెంగంపల్లి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పై గ్రామాల్లో ఇప్పటికే భూములకు సంబంధించిన రిసర్వే పూర్తి చేయడం జరిగిందన్నారు. తమ పొలాలకు సంబంధించి కొలతల విస్తీర్ణంలో తేడాలు, సర్వే నెంబర్లు మార్పులు, ఏదైనా జరిగి ఉంటే రైతులు గ్రామసభ దృష్టికి తీసుకువచ్చి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

నేటి నుంచి ఆధార్ స్పెషల్ క్యాంపులు..

విశాలాంధ్ర - చాగలమర్రి : మండల వ్యాప్తంగా ఈ నెల 22 నుంచి 25 వరకు ఆధార్ అప్డేట్ కోసం ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేస్తున్నట్లు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జ్ ఎంపీడీవో రాజేంద్ర ప్రసాద్ సోమవారం తెలిపారు. ఈ నెల 22న చాగలమర్రి 2, 5 సచి వాలయాలు, శెట్టివీడు, గొడిగనూరులో, 23న మల్లెవేముల, మద్దూరు, ముత్యాలపాడు 1, 2, డి.వనిపెంట, 24న పెద్ద బోధనం, చాగల మర్రి-1, చిన్నవంగలి, పెద్దవంగలి గ్రామాల్లో నిర్వహిస్తామన్నారు. 25న నేలంపాడు చాగలమర్రి-3 4, చింతలచెరువు సచివాలయాల్లో ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.

అంబేద్కర్ విగ్రహావిష్కరణకు విరాళం..

విశాలాంధ్ర- కోవెలకుంట్ల: పట్టణంలో ఆవిష్కరించనున్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి జనసేన నాయకులు సోమవారం ఆ పార్టీ కార్యాలయంలో విరాళం అందజేశారు. ఈ సంద ర్భంగా పార్టీ కోఆర్డినేటర్ పత్తి సురేష్ బాబు మాట్లాడుతూ ఉపముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ అడుగుజాడల్లో నడుస్తూ, సేవ చేయడంలో ముందు ఉండాలనే ఉద్దేశ్యంతో విరాళం అందజేసినట్లు తెలిపారు.

నేడు సమస్యల పరిష్కార వేదిక..

విశాలాంధ్ర - రుద్రవరం: నేడు మండల కేంద్రంలోని మండల పరిషత్ సమావేశ భవనంలో మధ్యాహ్నం 2 గంటలకు సమస్యల పరిష్కార వేదికను నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో భాగ్యలక్ష్మి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికై ఏర్పాటు చేసిన వేదికకు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ హాజరు కానున్నట్లు ఆమె తెలిపారు. ఈ వేదికలో రెవెన్యూ, గృహ నిర్మాణం, పింఛన్‌లు, ఇతర సమస్యలను పరిష్కరించేందుకు కార్య క్రమం జరుగుతుందన్నారు. మండల ఆయా శాఖల చెందిన ప్రభుత్వ అధికారులు, ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, హాజరు కావాలని ఆమె కోరారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర -మిడుతూరు: నందికొట్కూరు నియోజవర్గ పరిధిలోని మండల కేంద్రమైన కొత్తపల్లి గ్రామానికి చెందిన స్వాములు (21) అనే యువకుడు ప్రమాదవశాత్తు మృతి చెందాడు. విషయం తెలుసుకున్న నియోజకవర్గ సీనియర్ వైసీపీ నాయకులు ఎక్కాలదేవి చంద్రమౌళి ఆకుటుంబ సభ్యులకు ఆర్థిక సాయాన్ని అందించారు. మృతి చెందిన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ కుటుంబ సభ్యులకు భరోసా కల్పిస్తూ ఆ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి గూడెం రవికుమార్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణం ఏర్పాటు చేయొద్దంటూ పొదుపు మహిళలు ధర్నా

విశాలాంధ్ర - గడివేముల: మండల కేంద్రమైన గడివేములలోని ఐక్య సంఘం కార్యాలయం వద్ద మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దని ఐక్య సంఘం అధ్యక్షులు ఎల్లమ్మ, సెక్రటరీ లలితలు డిమాండ్ చేశారు. ఐక్య ఆధ్వర్యంలో రాస్తారోకో, ధర్నా నిర్వ హించి అనంతరం ర్యాలీగా స్థానిక తహశీల్దార్ కార్యా లయం వద్ద తహశీల్దార్ వెంకటరమణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ పొదుపు కార్యాలయం వద్ద మద్యం దుకాణం ఏర్పాటు చేయడంతో మహిళలకు రక్షణ లేకుండా పోతుందన్నారు. పొదుపు కార్యాలయంలో మద్యం దుకాణం లేనప్పుడే కార్యాలయం ఆవరణంలో ఖాళీ మద్యం సిసాలు, వాటర్ పాకెట్స్, ప్లాస్టిక్ గ్లాసులు వేస్తున్నారన్నారు. ఇప్పుడు ఏకంగా మద్యం దుకా ణాన్ని ఏర్పాటు చేయడం ఎంతవరకు సబబుని వాపో యారు. ఇక్కడ ఏర్పాటు చేస్తున్న మద్యం దుకాణానికి పర్మిషన్ ఇవ్వకూడదని నినాదాలు చేశారు. మండల ఐక్య సంఘం మాజీ అధ్యక్షురాలు సుభద్రమ్మ, ఒడ్డు లక్ష్మి దేవి, జయమ్మ పొదుపు మహిళలు పాల్గొన్నారు.

గిరిజనులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి : సీపీఐ

విశాలాంధ్ర - నంద్యాల : జూపాడుబంగ్లా మండలం బన్నూర్, సిద్దేశ్వరం గిరిజనులకు ఇళ్ల స్థలాలు, పట్టాలు, పొలాలిచ్చి ఆదుకోవాలని సీపీఐ జిల్లా నాయకులు ఎం. రమేష్ బాబు, గిరిజన సమైక్య జిల్లా నాయకులు చెంచు పుల్లయ్యలు కోరారు. సీపీఐ ఆధ్వ ర్యంలో ప్రజా సమస్యల పరిస్కార వేదికలో జిల్లా కలెక్టర్ రాజకుమారికి వారు వినతిపత్రం అందజే శారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూపాడు బంగ్లా మండలం సిద్దేశ్వరం గ్రామ గిరిజనులకు ఇంటి పట్టాలు ఇవ్వాలని అనేక ఏళ్ల నుంచి పోరాటం చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని, తక్షణమే పట్టాలు మంజూరు చేయాలన్నారు. 80 బన్నూరు గ్రామంలో ఇళ్ల స్థలాలు లేక దాదాపు 50 కుటుంబాలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే వారికి ఇళ్ల స్థలాలు, పొలం ఇవ్వాలని కలెక్టర్‌కు విన్నవించారు. చాబోలు గ్రామంలో గతంలో కలెక్టర్ అధికారుల ఇచ్చిన హామి మేరకు వారికి జూపాడుబంగ్లా గ్రామంలో ప్రతి ఇంటికి మూడు సెంట్లు స్థలం కేటాయించాలని, జూపాడు బంగ్లా మండలం పారుమంచాల గ్రామంలో అన్యాక్రాంతమైన వందలాది ఎకరాల ప్రభుత్వ భూములను పరిరక్షించి పేదల భూములు ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకొని భూమిలేని నిరుపేదలకు అందించాలని వారు కోరారు.

పకృతి వ్యవసాయం ఎంతో ఉపయోగకరం

విశాలాంధ్ర -బనగానపల్లె: ప్రకృతి వ్యవసాయంతో పండించిన కూరగాయలు ఆరోగ్యానికి ఎంతో ఉపయోగ కరమని వ్యవసాయ అధికారి సుబ్బారెడ్డి తెలిపారు. పొదు పు భవనం ఆవరణంలో క్లైపే యూనిట్, వీరాపురం యూని ట్ ప్రకృతి వ్యవసాయం పద్ధతిలో పండించిన ఏటీఎం మోడల్, ఏ మోడల్ కూరగాయలు స్టాల్ ఏర్పాటు చేసి కూరగాయలు అమ్మడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల వ్యవసాయ అధికారి సుబ్బారెడ్డి పాల్గొని ప్రకృతి వ్యవసాయంలో పండించిన కూరగాయలు ప్రజలు తినడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌వన్ పెద్ద స్వామి, లత, విశ్వనాథ్ రెడ్డి, కుళాయి స్వామి, రాము, శివ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ సభ్యత్వం నమోదు చేసుకోండి

విశాలాంధ్ర- కోవెలకుంట్ల: టీడీపీ సభ్యత్వం నమోదు చేసుకొని, భవిష్యత్ గ్యారంటీ పొందాలరి రాష్ట్ర కార్యదర్శిగడ్డం రామకృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గడ్డం రామకృష్ణారెడ్డి ఈనెల 26 నుండి జరగబోతున్న పార్టీ కార్యకర్తల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించు కోవాలని కోరారు. రూ.వంద కనీస రుసుముతో లేదా రూ.లక్ష జీవిత కాలపు సభ్యత్వ రుసుముతో పార్టీ కార్యకర్తలుగా నమోదు చేసుకోవడం ద్వారా భవిష్యత్తులో ఏదైనా ప్రమాదం జరిగినా వారికి పార్టీ తరఫున రూ.2 లక్షల నుండి రూ.5 లక్షల వరకు బీమా వర్తింపుతో పాటుగా మృతి చెందిన రోజున దహన సంస్కారాలకు రూ.10 వేల తక్షణ సాయాన్ని పొందవచ్చునని తెలిపారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నందు బనగానపల్లె నియోజక వర్గం అగ్రస్థానంలో నిలపాలని ఆయన పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

కాటమరాజు దేవాలయ ఏర్పాటుకు కృషి

విశాలాంధ్ర - వెలుగోడు : వెలుగోడు రిజర్వాయర్ మద్రాస్ కాలువ వద్ద ఏర్పాటైన కాటమ రాజు విగ్రహము నకు దేవాలయము నిర్మించుటకు రాష్ట్ర స్థాయి నాయకుల సహకారంతో కృషి చేస్తామని అఖిల భారత యాదవ మహాసభ నాయకులు పేర్కొన్నారు. కాటమరాజు విగ్రహానికి అఖిల భారత యాదవ మహాసభ నాయకులు నాగేశ్వరావు యాదవ్, ఎస్. రఘు రాముడు యాదవ్, రాజలింగయ్య యాదవ్, శివుడికి పూజలు చేశారు. వారు మాట్లాడుతూ గతంలో ఈ విగ్రహం బండి ఆత్మకూరు అనంతయ్య పొలములో ఉండేదని, 1983లో రిజర్వాయర్ నిర్మాణం కొరకు శంకుస్థాపన చేసిన తర్వాత ఈ ప్రాంతాన్ని మునుక భూములుగా గుర్తించి తెలుగంగ అధికారులు విగ్రహాన్ని గట్టు తాండ రస్తాలో మద్రాసు కాలువ వద్ద ఏర్పాటు చేశారని అన్నారు. ఇక్కడి ప్రజలు ఈ విగ్రహానికి ప్రతి గురు, ఆదివారాలలో పూజలు చేస్తారని చెప్పారు. ఇక్కడ దేవాలయ నిర్మాణం కొరకు దాతలు దాతలు ముందుకు రావాలని కోరారు.

ఆక్రమణలో ఉన్న వక్ఫ్ బోర్డు స్థలాన్ని పరిరక్షించాలి

విశాలాంధ్ర - నంద్యాల : పట్టణ పద్మావతి నగర్‌లోని వక్ఫ్ బోర్డు స్థలంపై ఉన్న ఆక్రమణ తొలగించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ హరి చరణ్‌కి ఇండియన్ యూనియన్ ముస్లిం లిగ్ పార్టీ కర్నూల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు మౌలానా అబ్దుల్ సలాం వినతిపత్రం అందజేశారు. నంద్యాల పట్టణ నడిబొడ్డు పద్మావతినగర్‌లో సర్వేనెంబర్ 750 వక్ఫ్ బోర్డు స్థలం 26 సెంట్లు అన్యాక్రాతం అయిన విషయాన్ని జిల్లా కలెక్టర్‌కు, వక్ఫ్ బోర్డు అధికారులకు వివరించడం జరిగిందని, ఈ స్థలంలో ఆక్రమణలు తొలగించి ముస్లింలకు మసీదు సంక్షేమం కొరకు అప్పగించాలని వివరించామన్నారు. ముఖ్యంత్రి, స్థానిక మంత్రి స్పందించి ఈ స్థలాన్ని ముస్లిం సంస్థకు అప్పగించాలని కోరారు. గన్ని అమీర్, మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

ర్యాపిడ్, బ్లిట్జ్ చదరంగం పోటీల విజేతలకు బహుమతి ప్రధానం

విశాలాంధ్ర - నంద్యాల : జిల్లా చెస్ సంఘం ఆధ్వర్యంలో క్రాంతినగర్ లో ఉన్న శ్రీ శాంతినికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు నంద్యాల జిల్లా రాపిడ్, బ్లిట్జ్ విభాగాలలో నిర్వహించిన చదరంగం జట్ల ఎంపిక పోటీల విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. జిల్లా చెస్ సంఘం అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, లయన్స్ క్లబ్ అధ్యక్షులు నిజాముద్దీన్ ముఖ్య అతిథులుగా పాల్గొని విజేతలకు ట్రోఫీలు, పతకాలు అందజేశారు. డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ గెలిచిన వారు తిరిగి గెలవడం కోసం, ఓటమి చెందిన వారు తదుపరి పోటీల్లో విజేతలుగా నిలవడం కోసం క్రమశిక్షణతో కూడిన నిరంతర సాధన అవసరమ న్నారు. జిల్లా జట్టుకు ఎంపికైన వారు పశ్చిమగోదా వరి జిల్లా భీమవరంలో జరగ నున్న రాష్ట్ర స్థాయి పోటీలలో విజేతలుగా నిలిచి నంద్యాల కీర్తి ప్రతిష్టలు ఇనుమడింప చేయాలని ఆకాంక్షించారు. నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు నిజాముద్దీన్, జిల్లా చెస్ సంఘం ప్రధాన కార్యదర్శి రామ సుబ్బారెడ్డి, వైద్యులు డాక్టర్ నేట్ల మహేశ్వర రెడ్డి, పాలిటెక్నిక్ కాలేజీ అధ్యాపకులు రవిశంకర్‌లు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొనే జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు: రాపిడ్ విభాగంలో నంద్యాల కు చెందిన యు.హర్షవర్ధనాచారి మొదటి స్థానం, ఆళ్లగడ్డకు చెందిన యం. యుగంధర్ రెండవ స్థానం, బ్రిడ్జి విభాగం మొదటి స్థానం నంద్యాలకు చెందిన జి. శాలిమ్ మణి కుమార్, హర్షవర్ధనాచారి రెండవ స్థానం సాధించి నంద్యాల జిల్లా తరఫున రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనడానికి అర్హత సాధించారు.

పరీక్షల నిర్వహణలో గందరగోళాన్ని నివారించాలి

విశాలాంధ్ర-నంద్యాల: నిర్మాణాత్మక పరీక్షల నిర్వహణలో గందరగోళం నివారించాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అజాం బేగ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్టీయూ బేతంచెర్ల మండల శాఖ ప్రాంతీయ కార్యాలయం నందు జరిగిన ముఖ్యనాయకుల సమా వేశంలో ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం మారినా విద్యాశాఖలో అధికారుల తీరులో మార్పు లేద న్నారు. గత నవంబర్‌లో జరిన నిర్మాణాత్మక పరీక్షలు, లక్ష్యాత్మక ప్రశ్నల రూపంలోనా, వివరణాత్మాక ప్రశ్నల రూపంలోను చెప్పలేద న్నారు. ఈ ప్రభుత్వలోను మొదటి నిర్మాణాత్మక పరీక్షలు గత ప్రభుత్వం నిర్వహించిన విధంగానే పేరు మార్చి ఈ కూటమి ప్రభుత్వం నిర్వ హించారన్నారు. కేవలం 20 మార్కుల నిర్మాణాత్మక పరీక్షలు 6 రోజులు నిర్వహించడం వల్ల సమయం వృధా అయ్యిందని, ఇప్పటికైనా ఉపాధ్యాయుల అభిప్రాయాలు తీసుకొని ప్రశ్నల రూపకల్పనలో సమ తుల్యత పాటించాలని కోరారు. ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ వెంకట నాయక్, జిల్లా ఉపాధ్యాయ వాణి కన్వీనర్ చెన్నప రెడ్డి, జిల్లా కార్యదర్శి పుల్లయ్య, సుబ్బారెడ్డితో పాటు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

యాగంటి ఉమామహేశ్వర స్వామికి పల్లకి సేవ

విశాలాంధ్ర -బనగానపల్లె: యాగంటి ఉమామహేశ్వర స్వామికి సోమవారం ఆలయ అర్చకులు, చైర్మన్ బి.చంద్రుడు ఆధ్వర్యం లో పల్లకి సేవ నిర్వహిం చారు. అనంతరం స్వామి వారి తీర్థప్రసాదాలు భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాత పాడు సర్పంచ్ బెడుదల మహేశ్వర్ రెడ్డి దంపతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

విశాలాంధ్ర -కొలిమిగుండ్ల : మండ లంలోని తిమ్మనాయునిపేట గ్రామ సమీపంలో మోటార్ సైకిల్‌పై నుండి కిందపడి సోమవారం వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. సంజామల మండలం గిద్దలూరు గ్రామానికి చెందిన దూదే కుల రాజు పని నిమిత్తం తాడపత్రికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయ పడ్డాడు. తిమ్మనాయునిపేట గ్రామ సమీపంలో రోడ్డు గుంతలకు మోటార్ సైకిల్ వెనుక కూర్చున్న దూదేకుల రాజు అదుపుతప్పి రోడ్డుపై పడడంతో గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం రాజును 108 నందు కోవెల కుంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు 108 సిబ్బంది భాస్కర్, పవన్ గోపాలు తెలిపారు.

కూలిన మట్టిమిద్దే..



విశాలాంధ్ర -బనగానపల్లె: మండలం పలుకూరు గ్రామంలో సోమవారం ఉదయం వర్షాలు కురిసిన ప్రభావంతో మట్టిమిద్దె కూలడంతో చాకలి మద్దిలేటి కుటుంబం అరచేతిలో ప్రాణా లు పెట్టుకుని బయటికి పరిగెత్తారు. దీంతో ప్రాణప్రాయం తప్పింది. ఈయన ధోబి పని చేసుకునే జీవనోపాధి కొనసాగిస్తున్నారు. కుటుం బాన్ని ఆదుకోవాలని అధికారులను ప్రభుత్వాన్ని మద్దిలేటి కోరారు.

ఎమ్మార్పీ ధరలకే మందులు విక్రయించాలి

విశాలాంధ్ర -ఉయ్యాలవాడ: ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే మందులను రైతులకు విక్రయించాలని వ్యవసాయ అధికారి సుధాకర్ రెడ్డి డీలర్లకు సూచించారు. సోమవారం మండలంలోని మాయలూరు గ్రామంలో ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటు న్నామన్నారు. దుకాణదారులు తమ వద్ద నిల్వ ఉన్న మందులను రైతులకు అందజేయాలని సూచించారు.

తాగునీరు వృధా

- తెగి పక్కన పడిన పైప్‌లైన్
- పట్టించుకోని అధికారులు

విశాలాంధ్ర- కొలిమిగుండ్ల: మండలంలోని బెలూం సింగవరానికి అవుకు రిజర్వాయర్ నుండి తాగునీరు సరఫరా అయ్యే పైప్‌లైన్ తెగిపోయి, తాగు నీరంతా మార్గ మధ్యలోనే వృధా అవుతోంది. గత 15 రోజుల నుంచి తాగునీరు వృధాగా పారుతున్నా సంబంధిత అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. బలూం, బెలూం సింగవరం గ్రామాల మధ్య తాగునీటి పైప్‌లైన్ తెగి, వేరువడడంతో నీరంతా రోడ్డుమీద ప్రవహిస్తూ వృధాగా సమీప నాపరాతి గనిలోకి వెళుతున్నది. అవుకు తాగునీటి పథకం కింద ఆయా గ్రామాలకు రిజర్వాయర్ నుండి పైప్‌లైన్‌లు ఏర్పాటుచేసి తాగునీటిని ప్రభుత్వం సరఫరా చేస్తోంది. ప్రధాన రహదారి పక్కనే తాగునీరు వృధా అవుతున్నా పట్టించుకోవడం లేదు. బెలూం సింగవరం గ్రామంలో తాగునీటి కొరత లేకపోవడంతో అధికారులు కూడా పైప్‌లైన్ నీటి వృధాను గురించి పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. మండలంలో సరైన వర్షాలు లేక ఇప్పటికే పలు గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తుతోంది. మరమ్మత్తు చేసే వరకైనా గ్రామం వైపు వెళ్లే తాగునీటి సరఫరా నిలిపేసి, ఇతర గ్రామాలకు మళ్లించినా కొంతమేర దాహార్తి తీరుతుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తాగునీటి పైప్‌లైన్‌కు మరమ్మత్తు చేసి, నీటి వృధాను అరికట్టి, గ్రామానికి యధాతధంగా తాగునీటిని సరఫరా చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలంటూ పోస్ట్ కార్డు ఉద్యమం

విశాలాంధ్ర - నంద్యాల : మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలంటూ పోస్ట్ కార్డు ఉద్యమం నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ నంద్యాల పార్లమెంటు జిల్లా డీసీసీ అధ్యక్షులు, ఏఐసీసీ మెంబర్ లక్ష్మీ నరసింహ యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయాన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాల హామీలలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు మహిళలకు హామీ ఇచ్చారన్నారు. ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు కావస్తున్నా ఉచిత బస్సు ప్రయాణం అమలు అతిగతి లేదన్నారు. పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆదేశాల మేరకు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయాలని కోరుచూ 22 నుండి 28వ తేదీ వరకు నంద్యాల జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో నియోజకవర్గాల ఇన్చార్జిలు, కో ఆర్డినేషన్ సభ్యుల ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలను సమన్వయంతో మహిళలతో కలిసి ఆర్టీసి బస్సులో ప్రయాణించి మహిళలకు పోస్ట్ కార్డు ఉద్యమం గురించి తెలియజేసి ఉచిత బస్సు ప్రయాణం హామీ వెంటనే అమలు చేయాలని సీఎం చిరునామా వెలగపూడి, అమరావతికి పంపాలని కోరారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జిలు, కోఆర్డినేషన్ సభ్యులు విజయవంతం చేయాలని లక్ష్మీనరసింహ యాదవ్ పిలుపునిచ్చారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర కర్నూలు

www.visalaandhra.com

కర్నూలు, మంగళవారం 22, అక్టోబరు 2024

అశువులు బాసిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్ధి

విశాలాంధ్ర - కర్నూలు క్రైమ్ : విధి నిర్వహణలో అశువులు బాసిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్ధి తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్ పెరేడ్ మైదానంలో నిర్వహించిన పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో పోలీసు అమరవీరులకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్ధి, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, కలెక్టర్ పి.రంజిత్ బాషా, ఎస్పీ బిందు మాధవ్ , జాయింట్ కలెక్టర్ బి.నవ్య ఘనంగా నివాళులు అర్పించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ ప్రజలకు రక్షణ కల్పిస్తూ ప్రాణాలు కోల్పోయిన పోలీసు అధికారుల ధైర్యసాహసాలు, దేశభక్తి విధేయతలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకుని గౌరవిస్తారన్నారు. దేశ, రాష్ట్ర సరిహద్దు అంతర్గత భద్రత రక్షణలో పోలీసులు ప్రతిరోజూ సవాళ్లను ఎదుర్కొంటున్నారన్నారు. దేశ భద్రత కోసం పగలు, రాత్రి అనే తేడా లేకుండా విధి నిర్వహణలో ప్రాణాలను ఫణంగా పెడుతూ, ప్రజల ప్రాణాలను కాపాడుతున్నారన్నారు.

కలెక్టర్ మాట్లాడుతూ భారత్-చైనా సరిహద్దుల్లోని ఆక్సయ్ చిన్ ప్రాంతంలో 16 వేల అడుగుల ఎత్తున రక్తం గడ్డకట్టే మంచు పర్వతాల మధ్యన ఉన్న హాట్ స్ప్రింగ్స్ వద్ద విధులు నిర్వహిస్తూ ప్రాణాలను కోల్పోయారని, ఆ రోజు నుండి అమరవీరుల సంస్మరణ దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. దేశ సరిహద్దుల్లోనే కాదు, అంతర్గతంగా ప్రతి రాష్ట్రంలో, జిల్లాలలో, గ్రామాలలో ప్రజల భద్రత దృష్ట్యా పోలీసులను ఏర్పాటు చేసుకున్నామన్నారు. అన్ని వ్యవస్థల కంటే పోలీసు వ్యవస్థలో పని చేయడం చాలా కష్టతరమని, 24 గంటలు పని చేయాల్సి ఉంటుందన్నారు. రోడ్డు ప్రమాదాలు, ఫైర్, ఏదైనా ప్రాణ నష్టం జరిగినప్పుడు వెంటనే స్పందించేది పోలీసులేనన్నారు. ప్రజల, ధన, మాన , ప్రాణాలను కాపాడడంలో ఎటువంటి సంకోచం లేకుండా పోలీసులు ముందుకు వెళతారని, అటువంటి పోలీసుల త్యాగాలను గుర్తు చేసుకోవడం, అమరులకు నివాళులు అర్పించడం మనందరి బాధ్యత అన్నారు. పోలీసు అమరవీరుల కుటుంబాలకు అండగా ఉంటామన్నారు.

ప్రజారక్షణ కోసం చేసే త్యాగం మహోన్నతమైనది : ఎస్పీ బిందు మాధవ్ మాట్లాడుతూ దేశ , రాష్ట్ర భద్రత కు పోలీసులు పగలనక, రాత్రి అనక విధి నిర్వహణలో ప్రజల శ్రేయస్సుకై ప్రాణత్యాగం చేస్తున్నారన్నారు. అమరవీరుల కుటుంబ సభ్యులతో మాట్లాడి, వారి సమస్యలను పరిష్కరించడం, వారి కష్టాలకు అండగా నిలబడుతున్నామన్నారు.

దేశ వ్యాప్తంగా విధి నిర్వహణలో వీరమరణం పొందిన 216 మంది పోలీసులకు శ్రద్ధాంజలి ఘటిస్తూ, నివాళులర్పించి 2 నిమిషాల పాటు మౌనం పాటించారు. అనంతరం అమర వీరుల కుటుంబ సభ్యులను జిల్లా ప్రధాన న్యాయమూర్తి, కలెక్టర్, ఎస్పీ శాలువతో సన్మానించి సత్కరించారు.

కార్యక్రమంలో హోంగార్డు కమాండెంట్ సదరన్ రీజియన్ ఎం.మహేష్ కుమార్, ఎఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, డిఎస్పీలు బాబుప్రసాద్, శ్రీనివాసాచారి, శ్రీనివాస రావు, పోలీసు వేల్ఫేర్ డాక్టర్ శ్రీమతి స్రవంతి, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు నాగరాజు, సిఐలు, ఆర్ఐలు, ఎస్సైలు, ఆర్ ఎస్సైలు పాల్గొన్నారు.

పత్తికొండలో..

విశాలాంధ్ర-పత్తికొండ: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డిఎస్పి వెంకటరామయ్య, ట్రైన్ డిఎస్పి ఉష, అర్బన్ సిఐ జయన్న హాజరై ముందుగా పోలీస్ అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు. డిఎస్పి మాట్లాడుతూ పోలీసులు అంకితభావంతో పని చేయాలన్నారు.

వాలంటీర్లకు న్యాయం చేయండి

కూటమి ప్రభుత్వానికి ఏపీ వాలంటరీ అసోసియేషన్ డిమాండ్

విశాలాంధ్ర-కర్నూలు సిటీ: ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం ప్రకారం వాలంటరీ వ్యవస్థను కొనసాగించి, వాలంటీర్లకు రూ10 వేలు గౌరవ వేతనం ఇచ్చి న్యాయం చేయాలని ఏపీ వాలంటీర్స్ అసోసియేషన్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా రెండు లక్షల అరవై వేల మంది వాలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఏపీ వాలంటరీ అసోసియేషన్ అనుబంధ ఏఐవైఎఫ్ సంఘం ఆధ్వర్యంలో వందలాది మంది వాలంటరీలు సోమవారం స్థానిక అంబేద్కర్ భవన్ నుండి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ఆందోళనకు దిగారు. ఏఐవైఎఫ్ నగర కార్యదర్శి బీసన్న అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసులు, వాలంటీర్ అసోసియేషన్ నాయకులు కుమారు మాట్లాడారు. రాజకీయ ఒత్తిళ్లతో రాజీనామా చేసిన వాలంటీర్లను తిరిగి వీధుల్లో కొనసాగించి, బకాయి పడ్డ 4 నెలల గౌరవ వేతనాన్ని తక్షణమే చెల్లించాలన్నారు.రాష్ట్రంలో గత 5 సంవత్సరాలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో ప్రభుత్వానికి, ప్రజల మధ్య వారధిలా వాలంటీర్స్ కీలకంగా వ్యవహరించడం జరిగిందన్నారు. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి వారు ప్రజలకు అందించిన సేవలను గుర్తించాలన్నారు. వాలంటీర్ వ్యవస్థను రాజకీయ కోణంలో చూడకుండా ఈనెల 23న జరిగే మంత్రివర్గ సమావేశంలో వాలంటీర్స్ వ్యవస్థ గురించి చర్చించి న్యాయం చేయాలని కోరారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమన్న, ఉపాధ్యక్షులు శరత్ కుమార్‌లు పాల్గొని సంపూర్ణ మద్దతు తెలియజేశారు. అనంతరం కలెక్టరేట్లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఏపీ వాలంటీర్స్ అసోసియేషన్ నాయకులు జిల్లా కలెక్టర్ రంజిత్ భాషకు వినతి పత్రాన్ని అందజేశారు.కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి రాజీవ్, నగర నాయకులు బాబయ్య, చంటి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాలసీలపై బోనస్ పెంచాలి

విశాలాంధ్ర ఎమ్మిగనూరు : ఎల్ఐసి పాలసీదారులకు పాలసీలపై చెల్లించే బోనస్ రేట్లు పెంచాలని లియాఫీ కడప డివిజన్ అధ్యక్షులు జయభారత్ రెడ్డి, బ్రాంచ్ అధ్యక్ష కార్యదర్శులు ప్రభాకర్ రెడ్డి, జయన్న ఆర్థిక కార్యదర్శి వీరేష్ , జోనల్ డివిజన్ నాయకులు రమేష్ ఆంధ్రయ్య సోమన్న అనంత భూరళి డిమాండ్ చేశారు. సోమవారం బ్రాంచ్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మినిమం పాలసీ లక్ష రూపాయలు నిర్దేశించాలని, 55 సంవత్సరాల పెంచిన వయసును 50 సంవత్సరాలకు తగ్గించాలని, ఏజెంట్ల కమిషన్ తగ్గించడం శోచనీయమన్నారు. పాలసీ ప్రీమియం రేట్లు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మధు, ప్రభాకర్ సూర్యకాంత్ రెడ్డి హరి సుభాన్ ప్రసాద్ ఆనందయ్య శెట్టి దేవేంద్ర మూర్తి తదితరులు పాల్గొన్నారు

దివ్యాంగులకు స్మార్ట్ టచ్ ఫోన్స్, ల్యాప్ టాప్ అందజేసిన కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో కర్నూలు : దివ్యాంగులకు చేయూతను అందించేందుకు ముగ్గురు దివ్యాంగులకు టచ్ ఫోన్స్, ఒకరికి ల్యాప్ టాప్ ను జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష పంపిణీ చేశారు.. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో దివ్యాంగులకు స్మార్ట్ టచ్ ఫోన్స్, ల్యాప్ టాప్‌ను కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగుల అవసరాలకు అనుగుణంగా ఇంటర్మీడియట్ చదువుతున్న జి.మోహన్, ఎం.వేణు, ఎం.చందు ముగ్గురికి స్మార్ట్ టచ్ ఫోన్‌లను, డిగ్రీ రెండవ సంవత్సరం చదువుతున్న అంధురాలు అయిన రేవతికి ల్యాప్ టాప్ ను విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అందచేస్తున్నామని తెలిపారు. వీటిని వినియోగించుకుని ఇంకా ఉన్నత చదువులు చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు.

కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల సహాయ సంచాలకులు రయిస్ ఫాతిమా పాల్గొన్నారు.

భవన నిర్మాణ సంక్షేమ చట్టాన్ని పునరుద్ధరించాలి ..

విశాలాంధ్ర-కర్నూలు సిటీ : కర్నూలు కలెక్టరేట్ కార్యాలయం వద్ద సోమవారం ఏఐటీయూసీ అనుబంధ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. నగర కార్యదర్శి నల్లన్న అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. మునెప్ప హాజరై మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ చట్టాన్ని పునరుద్దించాలని, పెండింగ్‌లో ఉన్న లబ్దిదారులకు డబ్బులు చెల్లించాలని, జీవో 17ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ఉచిత ఇసుక పాలసీని అమలు చేయాలన్నారు.గత ప్రభుత్వం భవన నిర్మాణ సంక్షేమ నిధుల్లో రూ450 కోట్లు దారి మళ్లించి కార్మికులను అన్యాయం చేసిందని ఆరోపించారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి కార్మికునికి వారం లోపల గుర్తింపుకార్డు ఇవ్వాలని, 55 సంవత్సరాలు నిండిన భవన నిర్మాణ కార్మికులందరికీ ఐదువేల రూపాయలు పెన్షన్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రహిమాన్, ఏఐటీయూసీ నగర అధ్యక్ష కార్యదర్శులు బి.వెంకటేష్, జి.చంద్రశేఖర్. ఆర్.కృష్ణారెడ్డి ఈశ్వర్‌రెడ్డి, నాగమద్దయ్య,పాల్గొన్నారు.

స్వీపర్ల బకాయి వేతనాలు చెల్లించాలి

విశాలాంధ్ర-కర్నూలు సిటీ: కర్నూలు కలెక్టరేట్ కార్యాలయం వద్ద సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో విధుల నుండి తొలగించిన స్వీపర్లు నిరసన వ్యక్తం చేశారు. స్కూల్స్ అసోసి యేషన్ జిల్లా కార్యదర్శి ఎం.సుంకమ్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప హాజరై మాట్లాడారు.ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహించిన స్కూల్ స్వీపర్స్‌కు 4 నెలలుగా బకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలన్నారు. రాజకీయ వేధింపులు వల్ల పత్తికొండ నియోజకవర్గంలో తొలగించిన 40 మందిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్, పత్తికొండ నియోజకవర్గం రంగన్న, స్కూలు ఆయాల నాయకురాలు లక్ష్మీదేవి, మాదేవి, సిద్ధమ్మ, హేమావతి పాల్గొన్నారు.

నది తీర గ్రామాల పంటల పరిశీలన

విశాలాంధ్ర, కౌతాళం:- తుఫాన్ కారణంగా ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంటలను తహసిల్దార్ మల్లికార్జున స్వామి ,వ్యవసాయ అధికారి శేషాద్రి, పరిశీలించారు. సోమవారం నది తీర గ్రామాలైన నది చాగి, మేలిగనూర్, వల్లూరు గ్రామాల పరిధిలోని నేల ఒరిగిన వరి పంటలను పరిశీలించి వాటిని ఎలా కాపాడుకోవాలో రైతులకు సలహాలు సూచనలు ఇవ్వడం జరిగిందని అధికారులు అన్నారు.. దాన్ని అంచనా వేసి జిల్లా కలెక్టర్ గారికి నివేదికలు పంపుతామని.. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు పాల్గొన్నారు

మదర్సాల విద్యాభివృద్ధికి సీఎం చేయూత

విశాలాంధ్ర, హొళగుంద: రాష్ట్రంలోని 185 ముస్లిం మదరసాల విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేయూతనిచ్చారని మైనార్టీ టిడిపి సీనియర్ నాయకుడు బి అబ్దుల్ సుభాన్ అన్నారు. హొళగుంద సల్ఫియా మసీదు ఆవరణ ముందు సోమవారం జరిగిన కృతజ్ఞత సభలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారంగా ముఖ్యమంత్రి సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నారని కొనియాడారు. మదర్సాలలో విద్యాబోధనకు ఉపాధ్యాయుల కొరత ఉన్నందున ప్రతి మదర్సాకు చంద్రన్న మదర్స విద్యా నవీనపథకం ద్వారా ముగ్గురు ఉర్దూ విద్యా వాలంటీర్లను నియమించడం జరుగుతుందని అన్నారు. మదర్సాలో పేద విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం విద్యా వాలంటీర్లను నియమించడం పట్ల ముఖ్యమంత్రికి, రాష్ట్ర వక్ఫ్ శాఖామంత్రి ఎన్ఎండి ఫారూఖ్‌కు, ఆలూరు నియోజకవర్గం టిడిపి ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. సభలో టిడిపి నాయకులు జుమ్మా సలీం, సిబిఎన్ ఆర్మీ మోయిన్, అతవుర్ రెహమాన్, అల్తాఫ్, అమీన్, మునీర్, తన్వీర్, మోజన్ కైసర్, ఇమామ్ షాకీర్ పాల్గొన్నారు

పేకాట రాయుళ్లు అరెస్టు

విశాలాంధ్ర-పెద్దకడబూరు : మండల పరిధిలోని హనుమాపురం గ్రామంలో పేకాట ఆడుతున్న నలుగురిని సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ నిరంజన్ రెడ్డి విలేకరులకు తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు గ్రామంలోని జగనన్న కాలనీలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో పోలీసు సిబ్బందితో దాడి చేసి నలుగురిని అరెస్టు చేసి వారి వద్దనుండి 33,600 రూపాయలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు. గ్రామాలలో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

జిల్లా స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక



విశాలాంధ్ర-పెద్దకడబూరు : జిల్లా స్థాయి ఖోఖో పోటీలకు మండల పరిధిలోని కల్లుకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపిక అయినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు దుబ్బన్న సోమవారం విలేకరులకు తెలిపారు. అండర్ 14 విభాగం నుండి 8వ తరగతి చదువుతున్న హరికృష్ణ, అండర్ 16 విభాగంలో 10వ తరగతి చదువుతున్న ఎండీ ఉదయ్ ఎంపిక అయినట్లు తెలిపారు. వీరు నేడు కర్నూలులోని డి.ఎస్. ఏ.ఔట్ డోర్ స్టేడియంలో జరుగు పోటీలలో పాల్గొంటారని తెలిపారు.

సమాచారం తెలుసుకోవడం ప్రజా హక్కు

విశాలాంధ్ర-చిప్పగిరి: సమాజంలో ప్రతిఒక్కరూ సమాచార హక్కు చట్టంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయ అధికారిని జయలక్ష్మి అన్నారు. సోమవారం చిప్పగిరి రైతు సేవ కేంద్రం నందు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార కమిషనర్ చావలి సునీల్ ఆదేశాల మేరకు సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాచార హక్కు చట్టంపై అవగాహన కలిగి ఉంటే గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. సమాచారం కోరిన రోజు నుండి 30 రోజుల లోపు అడిగిన సమాచారం ఇవ్వకపోతే న్యాయస్థానంలో ఆపిల్‌కు వెళ్లవచ్చు అని తెలిపారు.

ఒకేషనల్ కళాశాల ప్రిన్సిపాల్‌కు లండన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌చే ప్రశంస

విశాలాంధ్ర కర్నూల్ ఎడ్యుకేషన్ .. ప్రభుత్వ బి క్యాంప్ వొకేషనల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ యస్.నాగస్వామి నాయక్ విద్యా రంగం, సేవా రంగం యువత నైపుణ్యాభివృద్ధికి చేసిన కృషికి గాను లండన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ వారు ప్రదానం చేసిన ప్రసంశా పత్రాన్ని సోమవారం కర్నూలు పార్లమెంటు మెంబర్ బస్తిపాటి నాగరాజు చేతులమీదుగా అందుకున్నారు. కళాశాల సిబ్బంది వారికి అభినం దనలు తెలియజేశారు.

ఆర్ఎంపీ వైద్యులపై చర్యలు తీసుకోవాలి...

విశాలాంధ్ర-పత్తికొండ: ఆర్ ఎంపి వైద్యులపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి హనుమేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు అల్తాఫ్ డిమాం డ్ చేశారు. సోమవారం ఏఐవైఎఫ్ ప్రతినిధి బృందం ఆర్డీవో భరత్ నాయక్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో ఆర్ఎంపీ వైద్యులు పుట్టగొడుగుల్లా విస్తరించిపోయారన్నారు. అనారోగ్యానికి గురైన ప్రజలు ఆర్ఎంపి వైద్యులను ఆశ్రయిస్తే ప్రథమ చికిత్స చేయకుండా హెవీడోస్ ఇంజక్షన్లు, మాత్రలు ఇచ్చి విచ్చలవిడిగా దోచుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హత లేకున్నా ఆర్ఎంపి వైద్యులుగా కొనసాగుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ తుగ్గలి మండల కార్యదర్శి వినోద్, నాయకులు ఉపేంద్ర, మోహన్, నజీర్, దస్తగిరి, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించండి

విశాలాంధ్ర మద్దికెర : మండల కేంద్రంలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోకుండా అన్ని మౌలిక వసతులు కల్పించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కేఈ శ్యాం కుమార్ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం వివిధ శాఖల అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ మధ్య కాలంలో కురిసిన భారీ వర్షాలకు నియోజకవర్గం పరిధిలోని పలు చోట్ల రోడ్లు ధ్వంసం అయ్యాయని, డ్రైనేజి వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని, తాగునీటి పైప్‌లైన్ సరిగా లేక తాగునీటి సమస్యలతో ప్రజలు ఇబ్బందులు ఎదురుకుంటున్నారని, అధికారులు ఈ సమస్యలన్నీ దృష్టిలో ఉంచుకుని నియోజకవర్గంలో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సరఫరా, మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రభుత్వ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీకి అనుగుణంగా విద్యుత్ ప్రణాళికలు



విశాలాంధ్ర-బళ్ళారి చౌరస్తా : ప్రభుత్వ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీకి అనుగుణంగా అవసరమైన మార్పులు చేసి విద్యుత్ ప్రణాళికలు తయారు చేయాలని రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ జస్టిస్ నాగార్జున రెడ్డి సూచించారు. సోమవారం విద్యుత్ నియంత్రణ మండలి కర్నూలు కార్యాలయంలో రాష్ట్ర విద్యుత్ సమన్వయ ఫోరమ్ సమావేశం చైర్మన్ జస్టిస్ సి వి నాగార్జున రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఆర్థిక సంవత్సరం 2024-25 నుండి 2028-29 వరకు అమలు చేయనున్నరాష్ట్ర విద్యుత్ ప్రణాళికపై చర్చ జరిగింది. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్‌రాష్ట్ర ఇంధన శాఖ, సిఎం డి/ ఏపి ట్రాన్స్కో రాష్ట్ర విద్యుత్ ప్రణాళిక ముఖ్య ఉద్దేశ్యాలను, లక్ష్యాలను కమిటీ కి వివరించారు. జస్టిస్ నాగార్జున రెడ్డి మాట్లాడుతూ పొరుగు రాష్ట్రాలతో పోలిస్తే రాష్ట్రంలో విద్యుత్ పరికరాల అంచనా వ్యయాలు ఎక్కువగా ఉన్నాయని వాటిని అదుపు చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతీ విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలో విద్యుత్ నియంత్రణ మండలి తరపున ఒక ప్రత్యేక అధికారి నియమించామని, వారు సంస్థ పరిధిలో లైన్లు, ఉప కేంద్రాలు తనిఖీ చేసి, భద్రతా చర్యలనిమిత్తం తగు సూచనలు, సలహాలు చేస్తారని వెల్లడించారు. విద్యుత్ నియంత్రణ మండలి సభ్యులు ఠాకూర్ రామ సింగ్, మెంబర్ టెక్నికల్ వెంకట రామ రెడ్డి, మెంబర్ ఫైనాన్స్ చక్రధర్ బాబు, ఎండి జెన్కో (పర్చువల్ విధానం), పంపిణి సంస్థల సీఎండీలు పట్టం షెట్టి రవి , సంతోష్ రావు, జేఎండీ ఏ పి ట్రాన్స్కో కీర్తి చేకూరి , కేంద్ర ప్రభుత్వ సంస్థల ఎన్‌టిపిసి, సెకి ప్రతినిధులు పాల్గొన్నారు.

రైతు సమస్యలను పరిష్కరించండి..

డీఆర్‌ఓకు ఏపి రైతు సంఘం వినతి

విశాలాంధ్ర-కర్నూలు సిటీ: రైతు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్‌లో సోమవారం రైతు సమస్యలపై ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో డిఆర్‌ఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం, సిపిఐ నగర కార్యదర్శి పి రామకృష్ణారెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాసరావులు మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకం డబ్బులు రూ20 వేలు ప్రతి రైతుకు తక్షణమే ఇవ్వాలన్నారు. 2018లో తీవ్రమైన కరువు పరిస్థితుల కారణంగా 87 మండలాలను కరువు మండలాలుగా అప్పటి టీడీపీ ప్రభుత్వం ప్రకటించిందని వారు గుర్తు చేశారు. పంట నష్టపరిహారం డబ్బులు ఇంతవరకు విడుదల చేయలేదన్నారు. 2023 రబీలో పంటలు నష్టపోయిన రైతులకు కూడా పంట నష్టపరిహారం డబ్బులు ఇవ్వలేదన్నారు. జిల్లాలో వేరుశనగ,కంది, పత్తి కొర్ర ,పచ్చిమిర్చి తదితర పంటలకు ధరపూర్తిగా పడిపోయిందని, వ్యాపారస్తులు సిండికేట్‌గా ఏర్పడి రైతుల దగ్గర పంట చేతికి వచ్చే సమయంలో ధరలను తగ్గించేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.కావున తక్షణమే మార్క్ ఫెడ్, ఆయిల్ ఫెడ్ ద్వారా రైతులకు లాభదాయకమైన ధరలు నిర్ణయించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. సభ్యులు సురేంద్ర యాదవ్ మరియు దొడ్డిపాడు భాష పాల్గొన్నారు .

సమస్యలు పరిష్కరించేందుకే పరిష్కార వేదిక

విశాలాంధ్ర -కల్లూరు: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కల్లూరు మండలం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆవరణ లో గ్రీవెన్స్-డే నిర్వహించారు. మండలం నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు.వివిధ సమస్యలపై పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి కి వినతిపత్రాలను అందజేశారు. 113 అర్జీలు ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు ఇవ్వడం జరిగిందని వాటిని వీలైనంత త్వరలో పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ అర్జీలను పరిశీలించిన ఎమ్మెల్యే వెంటనే వాటిని పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల తహశీల్దార్ ఆంజనేయులు ,ఎంపిడిఓ శేషాచల రెడ్డి , సంబధిత శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

విశాలాంధ్ర. నందవరం .. నందవరం మండలంలోని సమస్యల పరిష్కారానికె ఎమ్మెల్యే డాక్టర్ బివి జయ నాగేశ్వరరెడ్డి ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ మాధవరావు దేశాయ్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత 5ఏళ్ల వైసిపి ప్రభుత్వంలో ప్రజలు, రైతులు ఎన్నో సమస్యల ఎదుర్కొన్నారని, వాటిని పరిష్కరించడానికి ఎమ్మెల్యే బివిజే ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని తాలూకా స్థాయిలో ఏర్పాటు చేసారన్నారు. అందులో భాగంగా 22న మంగళవారం గ్రామ పంచాయతీ ఆవరణలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బివిజే నిర్వహిస్తున్నారని, సమస్యలు ఉన్న ప్రజలు, రైతులు తమ సమస్యలను అర్జీలా రూపంలో ఎమ్మెల్యేకి అందించాలని కోరారు. అర్జీదారుడు ఆధార్, సమస్యకు తగిన పత్రాలను తమ వద్ద ఉంచుకొని ఎమ్మెల్యేగా అందించాలని కోరారు. అలాగే నందవరంలో కోట వీధిలో దేవమ్మ అవ్వ దేవాలయాన్ని నూతనంగా నిర్మించడంతో ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయ నిర్మాణానికి ఆర్థికసాయం అందించినందుకు ఆయన కమిటీ సభ్యులు సన్మానించారు

ప్రతి అర్జీకి సత్వర పరిష్కారం..

విశాలాంధ్ర-కర్నూలు సిటీ : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా వచ్చే అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని నగరపాలక అదనపు కమిషనర్ ఆర్.జి.వి. కృష్ణ అధికారులను ఆదేశించారు. సోమవారం నగర పాలక కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 14 ఫిర్యాదులు వచ్చాయి. ప్రధానంగా రహదారులు, తాగునీరు, వీధి దీపాలు, ఉద్యానవనాలను పరిరక్షించాలని, పార్కుల్లో పిచ్చి మొక్కలు తొలగించాలని,సచివాలయ ఉద్యోగుల బదిలీలను కౌన్సిలింగ్ ద్వారా పారదర్శకంగా చేపట్టాలని అర్జీలు అందజేశారు. వాటన్నింటినీ పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అదనపు కమిషనర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మేనేజర్ ఎస్.చిన్నరాముడు, ఆరోగ్యధికారి డా.కె.విశ్వేశ్వర్ రెడ్డి, రెవెన్యూ అధికారి జునైద్, ఎంఈలు సత్య నారాయణ, శేషాసాయి, టిపిఆర్‌ఓ వెంకటలక్ష్మి, టిడ్కో అధికారి పెంచలయ్య, డిపిఓ ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలి..

విశాలాంధ్ర-కర్నూలు సిటీ: నగరపాలకకు సకాలంలో పన్నులు చెల్లించి, అభివృద్ధికి సహకరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు ప్రజలను కోరారు. ఈ నెల 17 నుండి రెవిన్యూ విభాగం చేపట్టిన స్పెషల్ డ్రైవ్ ద్వారా రూ 94 లక్షల 53 వేలు పన్నుల రూపేనా రెవెన్యూ విభాగపు అధికారులు వసూలు చేశారు. అధికారులు ఆ వివరాలను అదనపు కమిషనర్ ఆర్.జి.వి. కృష్ణతో కలిసి కమిషనర్‌కు అందజేశారు. కమిషనర్ మాట్లాడుతూ నగరాభివృద్ధిలో పన్నులు ఎంతో కీలకమని, దీనిని గ్రహించి ప్రజలు స్వచ్ఛందంగా సహకరించడం సంతోషకరమన్నారు. పన్నులు చెల్లించనివారు (సీడీఎంఏ.ఏపీ.జీఓవి.ఇన్ వెబ్‌సైట్) ఆన్‌లైన్ ద్వారా త్వరగా పన్నులను చెల్లించాలని కమిషనర్ కోరారు. ఆర్‌ఓలు జునైద్, ఇశ్రాయేలు, ఆర్ఐలు పాల్గొన్నారు.

విద్యా, ఉపాధ్యాయరంగ సమస్యలు పరిష్కారించకుంటే ఉద్యమాలకు సిద్ధం

విశాలాంధ్ర, ఎమ్మిగనూరు : నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం విద్యా, ఉపాధ్యాయ రంగ సమస్యలను చొరవ చూపడం లేదని, దీనిపై ఉద్యమాలకు సిద్ధం కావాలని ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యస్.గోకారి, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.వెంకటేశ్వర్లులు పిలుపునిచ్చారు. సోమవారం ఎమ్మిగనూరులో యస్.టి.యు ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ 12వ పి.ఆర్.సి. కమిషన్ వెంటనే నియమించి, 30 శాతం మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని, 117 జి.ఓని రద్దు చేయాలని, ఉద్యోగులకు చెల్లించాల్సిన పెండింగ్ బకాయిలు 22 వేల కోట్ల రూపాయలను మంజూరు చేయాలి, 3,4,5 తరగతులను ప్రాథమిక పాఠశాలలో కొనసాగించాలని, ఉన్నత పాఠశాలలో ఆంగ్ల మధ్యమంతో పాటు తెలుగును సమాంతర మాధ్యమంగా కొనసాగించాలని, ఉపాధ్యాయులకు బోధనేతర కార్యక్రమాలను తగ్గించాలని, ఉపాధ్యాయుల కొరత లేకుండా తక్షణమే విద్యా వాలంటీర్లు నియమించాలన్నారు. తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వ పాఠశాలలకే వర్తింప చేయాలని కోరారు. అన్ని మేనేజ్మెంట్‌ల ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. 1998, 2008 ఎం.టి.ఎస్ ఉపాధ్యాయు లను రెగ్యులర్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎస్‌టీయూ నాయకులు ప్రసన్న రాజు, యల్లప్ప, ఎమ్మి గనూరు మండల అధ్యక్ష కార్య దర్శులు సురేష్, శేఖర్, సీనియర్ నాయకులు చంద్ర శేఖర్, వెంకట్రాముడు, సంజీవరాయుడు, ఓబులేసు, చిన్న తిమ్మన్న, నాగమద్దయ్య పాల్గొన్నారు.

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandra.com కర్నూలు, మంగళవారం 22, అక్టోబరు 2024

నా పెద్దకొడుకు నన్ను బిక్షాటన చేయిస్తున్నాడని ఓ తల్లి ఫిర్యాదు

విశాలాంధ్ర - కర్నూలు క్రైమ్ : కర్నూల్ కొత్తపేటలోని కర్నూల్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ ప్రక్కన ఉన్న ఎస్పీ క్యాంపు కార్యాలయంలో జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం కు వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాది దారులతో జిల్లా ఎస్పీ మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఈ రోజు మొత్తం 100 ఫిర్యాదులు వచ్చాయి.

వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని ...

నాకు ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడికి కంటి చూపు సరిగా లేదు. పెద్ద కుమారుడు వెంకటేశ్వర ఆచారి నాకు వచ్చిన ఇల్లును తీసుకొని , నాకు అన్నం, బాగోగులు చూడడం లేదని బిక్షాటన చేయిస్తున్నాడని కర్నూలుకు చెందిన మునెమ్మ ఫిర్యాదు చేశారు.

నా కుమార్తె కేశమ్మ ఎంబిఏ చేసింది. నా కుమార్తె కు అల్ఫా బీట్ గ్రూప్ కంపెనీ లో ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి నమ్మించి రూ. 4 లక్షలు తీసుకొని నకిలీ ఆర్డర్ కాపీ ఇచ్చి మోసం చేసిన అనంతపురంకు చెందిన సత్యనారాయణపై చర్యలు తీసుకోవాలని గూడూరు మండలం, గుడిపాడుకు చెందిన రైతు దుబ్బన్న ఫిర్యాదు చేశారు. కర్నూలు ఫుడ్ కార్పోరేషన్ డిపార్ట్ మెంట్‌లో ఉద్యోగం ఇప్పిస్తామని, రూ.3 లక్షల 50 వేలు తీసుకోని నెలకు రూ.30 వేలు జీతం వస్తుందని చెప్పి కర్నూలు కు చెందిన ఆయేషాబాను డబ్బులు తీసుకొని మోసం చేసిందని కర్నూలు కు చెందిన వినయ్ గౌడ్ ఫిర్యాదు చేశారు.

నది తీర ప్రాంతాల పోర్టులో థర్డ్ ఆఫీసర్ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి కర్నూ లుకు చెందిన వై.నాగేశ్వరరావు రూ. 7 లక్షలు తీసుకొని మోసం చేశాడని ఆదోనికి చెందిన ప్రవీణ్ ఫిర్యాదు చేశారు. అత్త, మామలు కుటుంబ సమస్యలు, అవసరాల కోసం నా బంగారం తీసుకొని వాడు కున్నారు. ఇప్పుడు అడిగితే ఇవ్వడం లేదని న్యాయం చేయాలని కర్నూలు, పసుపుల గ్రామానికి చెందిన లక్ష్మీదేవి ఫిర్యాదు చేశారు.

నేను అనంతపురంలో సీని యర్ అసిస్టెంట్‌గా పని చేస్తు న్నాను. నాకు ఫేస్ బుక్ ద్వారా కార్తీక్ పరిచయం అయ్యాడు. రూ. 7 లక్షలు తీసుకొని మోసం చేశాడని గూడూరు మండలం, నాగాలాపురం కు చెందిన సలీమ ఫిర్యాదు చేశారు.

నేను డిగ్రీ పూర్తి చేశాను, నిరుద్యోగిని. నెలకు రూ. 30 వేలు జీతం అని, కర్నూలుకు చెందిన బూమ్ పాగు శ్రేయాన్ నాకు డెకావర్స్ టెక్నాలజీ హైదరాబాద్ లో ఉద్యోగం ఇప్పిస్తానని రూ. 3 లక్షల 90 వేలు తీసుకొని మోసపూరిత కంపెనీలో ఒక నెల మాత్రమే ఉద్యోగం చేయించుకుని మోసం చేశాడని కర్నూలు కు చెందిన షేక్ సల్మాన్ ఫిర్యాదు చేశారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ న్యాయం చేస్తామని ఎస్పీ తెలిపారు.

జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా అవార్డులకు ఆహ్వానం

- ఉమ్మడి జిల్లాల మైనారిటీల సంక్షేమ-శాఖ అధికారిణి సబిహా పర్వీన్



విశాలాంధ్ర-నంద్యాల : జాతీయ విద్యా దినోత్సవంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉర్దూ భాషాభివృద్ధి, సాహిత్య, విభిన్న విభాగాలలో అత్యుత్తమ సేవలు అందించిన మహోన్నతులకు మౌలానా అబుల్ కలాం ఆజాద్ జాతీయ స్థాయి పురస్కారం (రూ. 1,25,000/- ప్రోత్సాహకం, సర్టిఫికేట్, మెమెంటో), డాక్టర్ అబ్దుల్ హఖ్ ప్రాంతీయ స్థాయి పురస్కారం (రూ.1,00,000/- ప్రోత్సాహకం, సర్టిఫికేట్, మెమెంటో" అందించనున్నట్లు ఉమ్మడి జిల్లాల మైనారిటీల సంక్షేమశాఖ అధికారిణి సబిహా పర్వీన్ తెలిపారు. అలాగే రాష్ట్రానికి చెందిన ఉర్దూ సాహితీవేత్తలకు, పండితులకు (స్కాలర్), కవులు, పాత్రికేయులకు, విమర్శ, పరిశోదన, గద్యబోధన, ఉర్దూ సేవకులకు ఇలా వివిధ విభాగాలలో సేవలు అందించిన ఆరుగురికి "జీవిత కాల సాఫల్య పురస్కారాలు" అందించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఇదే విధముగా ఉర్దూ భాషాభివృద్ధి కోసం తమ వంతు కృషి చేస్తున్న ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం, ఉర్దూ భాషలో అత్యున్నత శ్రేణిలో రాణించిన విద్యార్థులకు ఉత్తమ విద్యార్థి పురస్కారం కూడా అందించనున్నారని తెలిపియున్నారు. ఈ పురస్కారాల కొరకు దరఖాస్తులను ఉర్దూ అకాడమీ ద్వారా జారి చేయబడిన దరఖాస్తు ఫారం పూరించి పాటశాలకు చెందిన ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు డిఇఓ, డిప్యూటీ ఇఓ ద్వారా, ఇంటర్, డిగ్రీ కళాశాలలకు చెందిన ఉపాధ్యాయులు కళాశాల ప్రిన్సిపాల్, డిఇవిఓ, ఆర్ఐఓ ద్వారా, విశ్వవిద్యాలయ ఉపాధ్యాయులు ప్రిన్సిపాల్, రిజిస్టార్ ద్వారా ప్రమాణ ప్రతులను జతపరుస్తూ 25.10.2024వ తేదీ లోపల, జీవిత సాఫల్య పురస్కారము కొరకు రాష్ట్రానికి చెందిన ఉర్దూ సాహితీవేత్తలు, పండితులు (స్కాలర్), కవులు, పాత్రికేయులు, విమర్శ, పరిశోదన, గద్య బోధన, ఉర్దూ సేవకులు కూడా ప్రతిపాదనలను డా. మహమ్మద్ మస్తాన్, డైరెక్టర్/సెక్రటరీ, ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఉర్దూ అకాడమీ, డోర్ నెం: 76-1-6ఏ /1%ఒ%2, మాలవికా విల్లా, హెచ్.బి. కాలని, భవానిపురం, విజయవాడ - 520012 అనే చిరునామాకు స్వయంగా లేదా పోస్టు, కొరియర్ ద్వారా పంపవలసినదిగా కోరారు.

ప్రజలకు సకాలంలో సమాచారాన్ని అందించండి

విశాలాంధ్ర, హెరాళగుంద: మండలంలోని ప్రజలకు సకాలంలో సమాచారాన్ని అందించాలని మండల వ్యవసాయ అధికారి ఆనంద్ లోక్ దళ్ ఆదేశించారు. వ్యవసాయ కార్యాలయంలో సోమవారం వ్యవసాయ సమాచార హక్కు చట్టం పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి ఆనంద్ మాట్లాడుతూ ప్రజలకు సమాచారం అడిగి హక్కు ఉందని కేంద్ర ప్రభుత్వం సమాచారం హక్కును ప్రవేశపెట్టిందని ఎవరైనా సరే సమాచారం అడిగితే 30 రోజుల్లో రాతపూర్వకంగా సమాచారాన్ని ఇవ్వాలని లేకపోతే ఉన్నతాధికారీ దృష్టికి తీసుకువెళ్తామని అన్నారు. వ్యవసాయ సిబ్బంది నిర్లక్ష్యం వహించకుండా ప్రజలు అడిగిన వెంటనే సమాచారాన్ని అందించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఆయోడిన్ లోపంతో వచ్చే సమస్యలపై అవగాహన కలిగి ఉండాలి

విశాలాంధ్ర ఓర్వకల్లు : నన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని గ్రామంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ లో ప్రపంచ అయోడిన్ లోప వ్యాధుల నివారణ దినోత్సవం సందర్భంగా అయోడిన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు, ఈ సందర్భంగా రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమ అధికారిణి హేమలత మాట్లాడుతూ అయోడిన్ లోపం వలన చిన్నారుల్లో ఎదుగుదల లోపం, బుద్ధి మాంద్యం, పెద్ద వయస్సు వారిలో థైరాయిడ్ సమస్యలు వస్తున్నాయని తెలిపారు.అయోడిన్ లోపం వల్ల ప్రబలే ఆరోగ్య సమస్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. నన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్.నాగరాజు మాట్లాడుతూ మనుషుల శారీరక పెరుగుదలకు మరియు అభివృద్ధికి, మానసిక వృద్ధికి, గర్భస్థ పిండం,చిన్న పిల్లల్లో మెదడు ఎదుగుదలకు, పిల్లల్లో తెలివి తేటలకు అయోడిన్ ఏ%శీ%తో ముఖ్యం అని తెలిపారు. గర్భవతులు తీసుకొనే ఆహారంలో అయోడిన్ లేకపోతే ,మంద బుద్ధి కలిగిన లేదా వినికిడి లోపం,మూగతనం వంటి సమస్యలు ఉన్న పిల్లలు పుట్టవచ్చును,,కొన్ని సార్లు గర్భస్రావం కూడా అవుతుందన్నారు. ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్.సుధాకర్ మాట్లాడుతూ శరీరంలో అయోడిన్ లోపిస్తే థైరాయిడ్ వస్తుందన్నారు, అయోడిన్ (ఉప్పు) త్వరగా అవిరి అయ్యే లక్షణం ఉంటుంది, దానిని గాలి చొరబడని మూత ఉన్న డబ్బాలలో నిల్వ చేయాలని తెలిపారు

రెండవ రోజు కొనసాగిన ఫెన్సింగ్ క్రీడలు



విశాలాంధ్ర-నంద్యాల : యస్.జీ.ఎఫ్ రాష్ట్ర స్థాయి అండర్ 17, 14 బాల, బాలికల ఫెన్సింగ్ క్రీడలు రెండవ రోజు నంద్యాల పట్టణంలోని స్థానిక పద్మావతి నగర్ డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ ఇండోర్ స్టేడియం నందు నంద్యాల జిల్లా అండర్ 14, 17 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వాహ కార్యదర్శి శ్రీనాథ్ ఆధ్వర్యంలో కొనసాగాయి. ఈ కార్యక్రమానికి బార్ అసోసియేషన్ అధ్యక్షులు, సీనియర్ అడ్వకేట్ రావినూతల దుర్గ ప్రసాద్, నంద్యాల జిల్లా బిజెపి కో-ఆర్డినేటర్ అభిరుచి మధు, నంద్యాల బిజెపి ఇంచార్జ్ రమేష్ నాయుడు, ఫెన్సింగ్ స్టేట్ అబ్జర్వర్ రాఘవేంద్ర, ఆంధ్రప్రదేశ్ స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు నిమ్మకాయల సుధాకర్ లు అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ క్రీడల ద్వారా కమ్యూనికేషన్స్ స్కిల్స్, స్నేహ బంధాలు మెరుగవుతాయని, గెలు పోటములు సమానంగా స్వీకరించి క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని కోరారు. అనంతరం జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎంఎస్ విరాజు ముఖ్య అతిథులుగా హాజరై బాలుర ఇప్పి,షాబర్, ఫాయిల్ బాలికల ఇప్పి, షాబర్, ఫాయిల్ టీం ఈవెంట్లలో విజేతలకు మెడల్స్ బహూకరించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఏ.పీ.రెడ్డి, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నాగేంద్ర, దండే నాగరాజు ఏ.పీ.పీ.ఈ.టి అండ్ స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రధాన కార్యదర్శి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయండి ..

విశాలాంధ్ర-నంద్యాల: జిల్లాలో బిజెపి సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని జిల్లా కోఆర్డినేటర్ అభిరుచి మధు పిలుపు నిచ్చారు. సోమవారం నంద్యాల బీజేపీ కార్యాలయంలో అభిరుచి మధు ఆధ్వర్యంలో క్రియాశీలక కార్యకర్తల కార్యశాల జరిగింది. ఈ కార్యక్రమానికి నంద్యాల జిల్లా బిజెపి ఇన్చార్జి రమేష్ నాయుడు, పెద్దలు మేడ మురళి, కసెట్టి కృష్ణమూర్తి, ఇంటి ఆదినారాయణ, జివిస్ నాగరాజు, లింగన్న, చల్లా దామోదర్ రెడ్డి, ఆర్లగడ్డ లక్ష్మిరెడ్డి, మైనార్టీ మోర్చా జాతీయ కమిటీ సభ్యురాలు షబానా హాజరయ్యారు. ప్రతి ఒక్కరికి బిజెపి సభ్యత్వం ఇవ్వాలని జిల్లాలో బిజెపి సభ్యత్వాలను భారీగా చేయాలని తీర్మానించినట్లు మధు పేర్కొన్నారు. ఈ సమావేశంలో అన్ని అసెంబ్లీల నాయకులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాన్ని తొలగించండి..

విశాలాంధ్ర-చిప్పగిరి: మండల కేంద్రం అరికెర రోడ్‌లో వెలసిన నూతన మద్యం దుకాణాన్ని తొలగించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, విద్యార్థి సంఘాల నాయకులు చేస్తున్న నిరసన కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ ఆలూరు నియోజకవర్గం మాజీ ఇంఛార్జ్ చిప్పగిరి లక్ష్మీనారాయణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ బాయ్స్ హాస్టల్ దాదాపు వంద మందికి పైగా విద్యార్థులు ఉన్నారు. అదే విధంగా బీసీ మేనేజ్మెంట్ కళాశాలల బాయ్స్ హాస్టల్లో ఇంటర్మీడియట్, డిగ్రీ, ఐటిఐ, పాలిటెక్నిక్ కళాశాలలో చదివే పేద మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులు మేనేజ్మెంట్ హాస్టల్లో వసతి పొందుతూ విద్యనభ్యసిస్తున్నారు. అయితే ఈ హాస్టల్ దగ్గర నూతన మద్యం దుకాణాన్ని విద్యాసంస్థల పక్కనే ఏర్పాటు చేయడం చూస్తుంటే మద్యానికి అలవాటు పడి బానిసలవ్వండి అంటూ ప్రోత్సాహించి వారి జీవితాలను నాశనం చేసే విధంగా ఉందని మండిపడ్డారు. ఆలూరు ఎక్సైజ్ సిఐ తక్షణమే స్పందించి మద్యం దుకాణాన్ని వేరే చోటికి తరలించాలని కోరారు. కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ నాయకులు తుంబలబీడు లక్ష్మన్న, లింగంపల్లి రామాంజనే యులు, వీరాంజనేయులు, ఆంథోనీ, ఈరన్న, కుమార్, వీరేష్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై అలుపెరుగని పోరాటం

-ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ మన బాధ్యత.

-యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె.సురేష్ కుమార్

విశాలాంధ్ర,ఎమ్మిగనూరు : ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం యుటిఎఫ్ అలుపెరుగని పోరాటం చేస్తుందని రాష్ట్రసహాధ్యక్షులు కె.సురేష్ కుమార్ అన్నారు. సోమవారం యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభల సందర్భంగా స్థానిక వీవర్స్ కాలనీ ఉన్నపాఠశాలలో జరిగిన మహాసభల సందర్భంగా కె.సురేష్ కుమార్ ఎస్టిఎఫ్ఎస్ఐ జెండాను ఆవిష్కరించగా, యుటిఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి నవీన్ పాటి యుటిఎఫ్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహాసభనుద్దేశించి కె.సురేష్‌కుమార్ మాట్లాడుతూ యుటిఎఫ్ స్థాపించి 50 సంవత్సరాలు అయిన సందర్భంగా స్వర్ణోత్సవాలు చేసుకుంటున్నామని తెలిపారు. అందరికి సమాన అవకాశాలు ఉండాలనే ఉద్దేశ్యంతో సోషలిస్టు సమాజం కోసం యుటిఎఫ్ సంఘాన్ని మన పెద్దలు ఏర్పాటు చేశారని చెప్పారు. హక్కుల కోసం, ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం ఎంతో పోరాటం చేశామని పేర్కొన్నారు. ప్రత్యామ్నాయ విద్యా విధానం కోసం పోరాడింది యుటిఎఫ్ మాత్రమే అన్నారు. సమాజశ్రేయస్సు కోరుకునేవారిగా ప్రభుత్వ బడులను కాపాడుకుందామని తెలిపారు. ఏ పాఠశాలను మూసివేయవద్దని కోరారు. పని సర్దుబాటు లోపభూయిష్టంగా ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వ కొత్త యాక్ట్ తీసుకువచ్చి ప్రతిఏడాది బదిలీలు, ప్రమోషన్లు ఉండేలా చేస్తుందని తెలిపారు. ఉపాధ్యాయులకు రూ.20వేల కోట్లు బకాయిలు ఉన్నాయని, రూ.3.50 కోట్లు మాత్రమే తీర్చారని చెప్పారు. పిఆర్సి కమిషన్ వేయాలని, అప్పటి లోపు ఐఆర్ సాధించుకోవాలన్నారు.

యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు యస్.నాగమణి, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.నవీన్ పాటీ, పూర్వజిల్లాఅధ్యక్షుడు జే.ఎల్లప్ప మాట్లాడుతూ 117 జీవొ పై ఏ సంఘం నోరుమెదపకపోతే యుటిఎఫ్ ఆందోళన చేసిందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు మూతపడితే పేద విద్యార్థులు నష్టపోతారని చెప్పారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు విక్టోరియమ్మ, విజయకుమారిని సన్మానించారు.

పోలీస్ అమరవీరులకు జోహార్లు : టంగుటూరి శీనయ్య

విశాలాంధ-బనగానపల్లె : పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా పోలీసు అమరుల త్యాగాన్నికి తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా వాణిజ్య విభాగ అధ్యక్షులు టంగుటూరి సీనయ్య జోహార్లు తెలిపారు. టంగుటూరి శీనయ్య మాట్లాడుతూ పోలీసు తమ ప్రాణాలను దేశ భద్రత కోసం అర్పించిన మహాను భావులని వారి త్యాగం మన సమాజానికి శాశ్వతంగా నిలిచి ఉంటుందని వారి కృషి, ధైర్యం, నిస్వార్థ సేవలు మన దేశానికి ఒక మైలురాయి అన్నారు.

ప్రజల సమస్యలను రీ ఓపెన్ కాకుండా నాణ్యతతో పరిష్కరించాలి

కలెక్టర్ పి.రంజిత్ బాషా

విశాలాంధ్ర. బ్యూరో కర్నూలు.. ప్రజల సమస్యలను రీ ఓపెన్ కాకుండా నాణ్యతతో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ - పిజిఆర్ఎస్) కార్యక్రమం ద్వారా జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 36 అర్జీలు రీ ఓపెన్ అయ్యాయని, అర్జీలు రీ ఓపెన్ కాకుండా ప్రజలు సంతృప్తి చెందేలా సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు..రీ ఓపెన్ అయిన దరఖాస్తులను సంబంధిత శాఖల పై అధికారులు పరిశీలించి వారి ఎండార్స్మెంట్ ను అప్లోడ్ చేయాలని కలెక్టర్ సూచించారు. సిఎం కార్యాలయం నుండి వచ్చిన దరఖాస్తులు 30 పెండింగ్ ఉన్నాయని, ఈ సమస్యలకు మొదటి ప్రాధాన్యత ఇస్తూ వాటిని త్వరితగతిన పరిష్కరించాలన్నారు..ఎప్పటికప్పుడు వచ్చిన పిటిషన్లను ఓపెన్ చేసి, నిర్దేశించిన గడువుకు ముందే సమస్యలను పరిష్కరించేలా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, డిఆర్ఓ చిరంజీవి, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

నేరనికి విద్యుత్ సబ్‌స్టేషన్ సమస్యలు పరిష్కరించండి ..

విశాలాంధ్ర, హెరాళగుంద: మండలంలోని నేరనికి విద్యుత్ సబ్టేషన్ సమస్యలను పరిష్కరించాలని ప్రజలు సోమవారం డిమాండ్ చేశారు. సబ్ స్టేషన్ ఏర్పాటు చేసినప్పటి నుంచి కాంపౌండ్ గోడ లేక పాములు పట్టపగలే వస్తున్నాయని ప్రజలు వాపోయారు. సబ్ స్టేషన్ ముఖ ద్వారానికి ఇనుప గేట్లు తెగిపోయిందని ఇనుపగేట్లు లేక దారి పొడవున పోయే పశువులు, మతి స్థిమితం లేని వారు వచ్చి ఇబ్బంది కలిగిస్తున్నారని ప్రజలు పేర్కొన్నారు. 10 గ్రామాలకు విద్యుత్ సరఫరా చేయడానికి నలుగురు విద్యుత్ ఆపరేటర్లు పనిచేస్తున్నప్పటికీ సరైన వసతులు లేక అవస్థలు పడుతున్నారని ప్రజలు ఆరోపించారు. సిబ్బందికి మరుగుదొడ్లు బయటికి వెళ్లి కాలకృత్యాలను చేస్తున్నారు. కాంపౌండ్ గోడ లేక విపరీతంగా పెరిగిన ముళ్ళకంప చెట్లు కాంపౌండ్ గోడ గ మారాయని అన్నారు. విద్యుత్ సబ్ స్టేషన్ సామాన్లు వర్షానికి తుక్కుబట్టాయని అధికారులు ఇనుప సామానులకు రంగు వేయాలని ప్రజలు కోరారు. మంచినీరు లేక బోరులోని ఫ్లోరైడ్ నీటిని తాగుతున్నామని దీనివల్ల ఒళ్లంతా నొప్పిగా ఉంటుందని ప్రజలు పేర్కొన్నారు సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని విద్యు త్ సోషల్ స్టేషన్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు

రేపు తుగ్గలికి ఎమ్మెల్యే రాక

విశాలాంధ్ర తుగ్గలి: మండలంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు బుధవారం ఎమ్మెల్యే కే. ఇ శ్యామ్ కుమార్ తుగ్గలికి వస్తున్నట్లు మాజీ శాలివాహన ఫెడరేషన్ ఛైర్మెన్,రాష్ట్ర టీడీపీ కార్యనిరాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర తెలిపారు.ఎమ్మెల్యే కే.ఇ శ్యామ్ కుమార్ తుగ్గలిలో శ్రీరాములు వీధిలో సీసీ రోడ్డును ప్రారంభించడం జరుగుతుందన్నారు.కావున మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు గ్రామ ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఆలూరు విద్యుత్ ఏడీగా సంతోష్

విశాలాంధ్ర, హెరాళగుంద: ఆలూరు విద్యుత్ ఏడీగా సంతోష్ సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. నూతన ఏడిఏ సంతోష్ కు విద్యుత్ అధికారులు పూలమాలలు వేసి సన్మానించారు. విద్యుత్ ఏడి సంతోష్ మాట్లాడుతూ నాణ్యమైన విద్యుత్ సరఫరా అందిస్తామని రైతులకు విద్యుత్ సమస్య ఏమైనా ఉంటే వెంటనే పరిష్కరిస్తామని అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు ఏఈలు,. విద్యుత్ సిబ్బంది, లైన్మెన్లు నూతన ఏడిని మర్యాదపూర్వకంగా కలిశారు

ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న స్కావెంజర్లు వేతనాలు చెల్లించాలి

విశాలాంధ్ర ఎమ్మిగనూరు : ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న స్కావెంజర్ల వేతనాలను వెంటనే చెల్లించాలని సిఐటియు తాలూకా కార్యదర్శి బి రాముడు డిమాండ్ చేశారు. సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో గత నాలుగు నెలలుగా ప్రభుత్వం వేతనాలు చెల్లించకపోవడం నిరసిస్తూ ఆందోళన చేపట్టారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న స్కావెంజర్లు వేతనాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. పిఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. ఎంఈఓకి వినతి పత్రం అందజేశారు. పాఠశాల స్కావెంజర్లు వరలక్ష్మి షాహిన్ పద్మావతి యు యం కవిత సుజాత లక్ష్మి జయశ్రీ షబానా రాజమ్మ జాహీద్ లక్ష్మి ఫాతిమా పాల్గొన్నారు.

మంచి నీటి బోరు మరమ్మత్తు చేయండి..

విశాలాంధ్ర, హెరాళగుంద: హెరాళగుంద గ్రామ సమీపంలో ఉన్న శ్రీ అగ్రహారం ఆంజనేయ స్వామి ఆవరణంలో మంచినీటి బోరు చెడిపోయిందని వెంటనే మరమ్మతు చేయాలని శ్రీ అగ్రహారం ఆంజనేయ స్వామి సేవా సమితి సభ్యులు సోమవారం గ్రామ కార్యదర్శి రాజశేఖర్ గౌడ్ కు ఫిర్యాదించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంచినీటిబొ రు చెడిపోవడం వల్ల భక్తులకు త్రాగునీటి ఇబ్బంది ఏర్పడిందని అలాగే భారీ వర్షానికి రోడ్డుకుగండిపడి రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతుందని మంచినీటి బోరుతో పాటు రోడ్డు మరమ్మతు చేయాలని కోరారు. మంచినీటి బోరు, రోడ్డు మరమ్మతు చేస్తే ప్రజలకు ఎంతో అనుకూలమవుతుందని అన్నారు. ఎన్నో ఏళ్లుగా ఉన్న మట్టి రోడ్డును అధికారులు బి టి రోడ్డుగా వేయాలని డిమాండ్ చేశారు.

పందుల పెంపకం వలన 24వ వార్డులో రోగాలు..



విశాలాంధ్ర ఎమ్మిగనూరు : ఎమ్మిగనూరు పట్టణంలో మున్సిపల్ వార్డ్ 24, లక్ష్మీపేట, ఇంటి నెంబర్: 5-1284-1- ఏ పందుల పెంపకం వల్ల దుర్గంధంతో వ్యాధులు రాకుండా ప్రజలను కాపాడాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి కి సోమవారం వినతిపత్రం ఇచ్చారు. సిపిఎం జిల్లా నాయకులు గోవిందు, సురేష్, వార్డు ప్రజలు బందేనవాజ్ మాట్లాడుతూ ఎమ్మిగనూరు పట్టణంలో పరిధిలోని 24 వ వార్డు లక్ష్మీపేట నందు ఖాళీ స్థలంలో సుమారు 100 పందులను పెంచుతున్నారు. దీనివల్ల చుట్టుపక్కల నివసిస్తున్న పేద ప్రజలు అనారోగ్యాలకు గురై, ఆస్పత్రుల పాలవుతున్నారు. కాలి స్థలం బురదకుంటగా మారి అక్కడికి దోమలు క్రిమి కీటకాలు, పాములు చేరుతున్నాయి. ఈ మురికి కూపంలో తయారైన దోమలు వల్ల ప్రజలకు, చిన్న పిల్లలకు డెంగ్యూ, మలేరియా, మెదడువాపు వ్యాధి ప్రభులే ప్రమాదము ఉన్నది. ఇప్పటికే స్వయం ఫ్లూ, డెంగ్యూ, మలేరియా జ్వరాలు వచ్చి పిల్లలు, ముసలి వారు ఆసుపత్రుల పాలయ్యారు. ఈ సమస్య వల్ల చుట్టుపక్కల ఉన్నటువంటి మేము మానసికంగా, అనారోగ్య సమస్యలను భరించలేక పోతున్నాము. గతంలో ఈ సమస్య మున్సిపాలిటీ అధికారులకు తెలియజేసినప్పటికీ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చిన్నపిల్లలు, వృద్ధులు అనారోగ్యం పాలు కాకుండా కాపాడాలని కమిషనర్ గారిని ప్రజలు దయతో కోరారు ఈకార్యక్రమంలో స్థానిక వార్డు ప్రజలు బందేనవాజ్, శ్రీనివాసులు, నరసింహులు గోపాలు నాగరాజు పాల్గొన్నారు

కాటికాపర్ల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర, ఎమ్మిగనూరు: స్మశానంలో వృత్తిని నిర్వహించే కాటికాపరులను వృత్తిదారులుగా గుర్తించి 4వ తరగతి ఉద్యోగులుగా నియమించాలని కోరుతూ కేజిబిఎస్ (కాటికాపరి గుంతలు తీసే బేగరుల సంఘం) ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా గ్రామ సచివాలయాల్లో వినతి పత్రాలు అందజేశారు. సోమవారం ఎమ్మిగనూరు మండలం సోగునూరు గ్రామంలోని కెవిపిఎస్ మండల ప్రధాన కార్యదర్శి తిమ్మన్న కెవిపిఎస్ మండల సహాయ కార్యదర్శి రాముడు మనోహర్ మాట్లాడుతూ ఎమ్మిగనూరు మండలం, సోగునూరు, బనవాసి, కే తిమ్మాపురం గ్రామాలలో సచివాలయాల పంచాయతీ సెక్రెటరీ, డిజిటల్ అసిస్టెంట్ కి వినతి పత్రాలు అందజేయడం జరిగింది అనంతరం వారు మాట్లాడుతూ చనిపోయిన వారికి స్మశానంలో గుంతలు తీసి పూడుస్తూ, కట్టెలు పేర్చి కాల్చే వృత్తిని అనాదిగా నిర్వహిస్తూ వస్తున్నారు. కరోనా కంటే భయంకరమైన వివిధ రకాల వ్యాధులు ప్రబలే స్మశానాల్లో తరతరాలుగా ఈ వృత్తిని నిర్వహిస్తున్నారు. ఇప్పటికీ వారిని ఒక వృత్తిదారులుగా గుర్తించి ఆదుకునే ప్రయత్నం చేయడం లేదు. ఎవరైనా చస్తేనే వారికి ఉపాధి.. ఆకలి తీర్చుకోవడం కోసం ఏదైనా వేరే పనికి వెళ్ళినా, మనిషి చనిపోయాడని తెలిస్తే అర్ధాంతరంగా ఆపనిని ఆపుకొని రావాల్సిందే.. చనిపోయిన మనిషికి రోగం వచ్చినా, ఉరేసుకున్నా, శవం ఉబ్బినా, కుళ్ళినా, కుటుంబ సభ్యులు ఉన్నా, లేకపోయినా చేతులతో ముట్టుకుని, పూడ్చేకూడ ఎలాంటి ఆరోగ్య భీమా లేదు, సరైన కూలీ లేదు. పూడ్చే సందర్భంగా సరైన స్మశాన స్థలాలు లేక, అంతకుముందు పూడ్చిన శవం సంపూర్ణంగా కుళ్లకముందే, ఎంత దుర్వాసన ఉన్నప్పటికీ దాన్ని వారి చేతులతో బయటకుతీసి లేదా దాన్ని మరింత లోతుకు తవ్వి, అవమానాలకు, దాడులకు గురికావాల్సి వస్తున్నప్పటికీ. వారి బతుకుల్లో మార్పు కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిందిగా వారికి న్యాయం చేయవలసిందిగా వారు డిమాండ్ చేశారు లేని లేనిపక్షంలో కలిసొచ్చే ప్రజా సంఘాల అన్నింటిని కలుపుకొని ఉద్యమిస్తామని వారు హెచ్చరించారు . ఈ కార్యక్రమంలో బనవాసి పక్కిలప్ప హనుమంతు వీరేష్ వెంకటేష్ మారన్న, బతకన్నా ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వే సమస్యలపై గ్రామసభ

విశాలాంధ్ర-వెలుగోడు : కలెక్టర్ వారి ఉత్తర్వుల మేరకు వెలుగోడు మండలం నందు రి సర్వే పూర్తయిన గ్రామంలో రీ సర్వేకు సంబంధించి సమస్యలపై గ్రామసభ నిర్వహిస్తున్నట్లు తహసిల్దార్ శ్రీనివాసులు గౌడ్ తెలిపారు. 22 తేది బోయరేవుల గ్రామంలో, 23వ తేదీ మోత్కూరు గ్రామంలో, 24వ తేదీ అబ్దుల్లాపురం గ్రామంలో, 25వ తేదీ గుంతకందాల గ్రామంలో, 26వ తేదీ రేగడ గూడూరు గ్రామంలో గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.